# చవిటినేల

పరిచయం: పేరు కామేశ్వరరావు. కాని పొరుగింటి పిల్లలు పెట్టిన పేరు కథల కామేశంగారు! (ఎందుకంటే రోజూ సాయంత్రంపూట చుట్టూ పిల్లల్ని కూర్చోబెట్టుకొని చిన్న చిన్న కథలు చెప్పటం కామేశంగారికి సరదా!) ఎదురింటి రాజేశ్వరి కామయ్యగారూ అంటుంది.

వృత్తి: చిన్న పిల్లలు రాసిన చిన్నకథలో కొమ్ములూ, క్రావళ్ళూ, వత్తులూ ఏత్వాలు సరిజేయటం – ఆ సరిజేసిన వాటి ప్రూఫులు దిద్దటం, దిద్దాక ... టైపుమెషిన్ ముందు కూర్చుని, అందరికీ తను పనిచేస్తున్న విషయం తెలిసేందుకు గాను టపటప బాదటం – అలా బాదటం పూర్తయ్యాక ... లావుపాటి బౌండులు ముందేసుకొని నిమిషానికొక అక్షరం చొప్పున పొడగటం. 'ఏమిటండీ పొడుగుతున్నార'ని ఎవరన్నా అడిగితే తొట్రుపడి ఏం చేస్తున్నదీ గుర్తుకుతెచ్చుకొని ... 'ఆఁ అవునండీ, వరల్డ్ జాగ్రఫీలోని ఇలస్ట్రేషన్ లిస్టు తయారు చేస్తున్నా!' అని చెప్పటం.

వయస్సు: నలభై సంవత్సరాలు. ఆరోగ్యం: పరవా లేదు. జీతం: నూట అరవై! పై ఆదాయం: ఇరవయ్! వెరశి: నూట ఎనభై రూపాయలు! సంసారం: తనూ, భార్య – ఇద్దరాడ పిల్లలు, ఇద్దరు మగపిల్లలు! పెద్ద అమ్మా

యికి పెళ్ళయింది. ఒక ఆడపిల్ల! పెద్దబ్బాయికి పెళ్ళి చేయాలనే ప్రయత్నం! కాని పెళ్ళివద్దని అతని గోల! రెండో అబ్బాయి ఒకసారి స్కూలుఫైనలుతప్పి మళ్ళీ చదువుతున్నాడు. నివాసం: అద్దె కొంప, అద్దె: ఇరవయ్ రూపాయలు! రెండే రెండు గదులు! ఒక గదిలో వంట, రెండో గదిలో పడక. పడక గదిలో ఒక డ్రాయరుతోపాటు ఒక పడక కుర్చీకూడా ఉంది! డ్రాయర్ మీద టేబుల్ క్లాత్ లేదు గాని ఆ లోటు రకరకాల సిరామచ్చలు తీర్చాయి! డ్రాయరు ముందున్న కుర్చీ, గుడ్డల్ని మహాబాగా కొల్లపెట్టిస్తుంది. పడక కుర్చీ ఉండంటే పొరపాటున దాని మీద నడుంవాలిస్తే వెనక్కు పల్టీ కొట్టవలసిందే! ఈ ఫర్నిచర్ ఆయన టి. టి. కె. ఘరంలో క్లెపిస్టుగా పనిచేసే రోజులలో కొన్నారట! గోడ మీద ఒక వేపున రామకృష్ణ పరమహంస ఫోటో, మరో వేపున సినిమానటి బస్టఫోటో. మరోవేపున శ్రీకృష్ణపరమాత్మలవారు గోపికల చీరెలు దొంగిలించి పొన్నచెట్టు మీద కెక్కి వయ్యారంగా కూర్చున్న ఫోటో క్యాలండర్!

దినచర్య: ఐదింటికి పాలవాడు తలుపుకొట్టటంతోటి లేపటం, లేచి పాలు తీసుకోవటం! ఆ తీసుకున్నపాలు వంటింట్లో అలమర పైఅరలో బెట్టి నిద్రబోతున్న భార్య తులశమ్మదగ్గిర కొచ్చి – ఉసేవ్! ఉసేవ్!!" అని అంటారు. ఆవిడలేచి కళ్ళు నులుపు కుంటూంటే—

"ఆపాలు రెండుళ్లొకులు తీసుకున్నా. తీసుకోవాల్సింది అంతేగా?" (రోజూ యిదేవరస) అంటారు! ఆవిడ అవునని గాని కాదనిగాని అనక లేచి వంటింట్లోకి ప్రయాణిస్తుంది

కామేశంగారు ఆమె వెంట వంటింట్లోకి నడచివెళ్ళి కూరగాయ లున్నాయా ? అంటారు! ఆమె మాట్లాడదుగాని 'ఊఁ' అంటుంది. అప్పుడాయన కాలకృత్యాలు ఆరంభిస్తారు. పళ్ళపొడితో మొహంకడుకుంటారు. (పళ్ళపొడిఅంటేబొగ్గు, ఉప్పూ కలిసినది. టూత్ పేస్టు అంటే ఆయనకు గిట్టదు) స్నానసంధ్య ముగించుకొని పిల్లల్ని లేపి తాను పడక కుర్చీలో కూర్చుంటాడు. అట్లా కూర్చున్న పదినిమిషాల్లో తులశమ్మగారు కాఫీ గ్లాసు పుచ్చుకుని వస్తుంది. (ఇంట్లో కాఫీ తాగేది తనూ తన భార్యా. పిల్లలెవరికీ కాఫీలలవాటులేదు. అలా తర్ఫీదు చేశారు. పిల్లల్ని !) కాఫీ తాగి... కాసేపు ఆ కాగితాలు ఈ కాగితాలు తిరగేసి ట్యూషన్ చెప్పటానికి బయలు దేర్తారు. ట్యూషన్ రోజు కొకగంట ! ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, ఇరవయ్ రూపాయలు చే[illegible]?... కాదు! ట్యూషన్ చెప్పవలసిన చోటు ఇక్కడికి మూడు ఫర్లాంగుల దూరంలో ఉంది! మధ్యన ఒక బార్బర్ షాపులోపదినిమిషాలు హాల్టు! ఆయనెప్పుడు తలపనిగానీ గడ్డంపనిగాని బార్బరుషాపులో చేయించుకోరు! (అక్కడికి రకరకాలఅప్రాచ్యులంతా వస్తారట! అంటువ్యాధులు అంటుకుంటాయట! అందుకనిగడ్డంతనే చేసుకుంటాడు. తలపనితనుచేసుకోడు. అందుకుగాను నెలకొకసారి ప్రత్యేకంగా ఒకమంగలి ఇంటికి వస్తుంటాడు)... వెళ్ళి షాపు యజమానిని పరామర్శిస్తారు... అతనికి తెలుసు. ప్రతిరోజూ ఇలా వచ్చి ఈ కామేశంగారు ఎందుకు పరామర్శిస్తారో ! బయట కుర్చీలోకూర్చోబెట్టి- యజమాని ఆరోజు దినపత్రిక ఆయనచేతి కందిస్తాడు! ఆయన వెళ్ళిన సమయానికి పత్రిక మరొకరి చేతిలో ఉంటే ...

ఫరవాలేదు, ఫరవాలేదులే ! అని వెళ్ళిపోతారు! కాని బార్బరు షాపుయజమాని కామేశంగారిని అంతమాత్రాన వదలడు- 'ఇదిగో చూశారూ... రష్యావాళ్ళు ఆటం హైడ్రోజన్ బాంబుల పరీక్షలు ఆపివేస్తారట!' అని ఆరోజు ప్రముఖవార్త విన్పిస్తే 'ఆఁ పోనిద్దూ రామస్వామీ ! ఎవరెట్లా చస్తేమనకెందుకు ?' అని కామేశంగారంటారు! 'కాదండీ!... రాయచూర్ దగ్గర మిలిటరీవాళ్లు రైల్వేవాళ్ళమీద కాల్పులు కాల్చారు... పదిహేనుమందికి పైగాగాయపడ్డారు-' 'పోనిద్దూ! రామస్వామీ ఆ కాల్పులతో మనకేం నిమిత్తం! కామేశంగారి సమాధానం! 'ఏమండోయ్ కామేశ్వరరావుగారూ! మీ యాక్టు పులుసులో కలసిందే ! సుప్రీంకోర్టు తీర్పుయిచ్చిందిగా ఇప్పుడేం చేయబోతున్నారు మీవాళ్లో ?' అని ఒక ఎరుగున్న వ్యక్తి లోపల్నుంచి వస్తూఅంటే - 'ఓహో! మీరా నారాయణగారూ!... ఆఁ ఏమియాక్టోఏమి సుప్రీంకోర్టుతీర్పో - దాంతో నాకేమి నిమిత్తంలేదులెండి, అలాంటి గొడవలంటే' నేనే ఆమడ దూరంలో ఉంటాను ! యాక్టు పులుసులోకలిస్తేఏం, గంగలో కలిస్తేఏం ?' అని అంటూ అక్కడ నిల్చుంటే ఇంకేమి గొడవ' మాట్లాడాల్సి వస్తుందోనని -కామేశంగారు శలవుతీసుకుంటారు.

(కామేశంగారికి మరో అనుమానంకూడా లేకపోలేదు. కొంపతీసి ఈ నారాయణ్ వెళ్ళి వాళ్ళ మేనేజరుతో ...కామేశ్వరరావుకు ఈ విషయంలో—ఇలాంటి అభిప్రాయాలున్నాయంటే ఏంగాను?...ఏమో, ఏ పుట్టలో ఏ ముందో?)

ట్యూషన్ ముగించుకొని యింటికి రావటం, వచ్చి రావటంతోటే భోంచేయటం, భోంచేసి వెనక్కు జారగిలబడితే

పట్టీ కొట్టించే పడకకుర్చీలో ముందుకొంగి కొంచెంసేపు కూర్చోవడం! (ఆ కుర్చీలో మరెవ్వరూ కూర్చోరు) ఆ తరువాత... సరీగ్గా తొమ్మిదిన్నరకు ఆఫీసుకు బయలుదేరటం. వేపేరీ బస్‌స్టాప్‌లో పదినిమిషాలు!... పార్కు-స్టేషన్‌లో ఐదునిమిషాలు... ఆ తరువాత కోడంబాకం స్టేషన్ బస్‌స్టాప్‌లో పదిహేను నిమిషాలు!.. సక్రమంగా బస్సులూ ఎలక్ట్రిక్ ట్రయిన్లూ అందితే ఆఫీసుకు పదింటికే చేర్తారు. లేకపోతే పదిన్నర! పదిన్నర దాటితే ప్రమాదం. (ప్రమాదమంటే ఏమీ లేదు. ఈ మధ్యన ఆలస్యంగా వచ్చేవాళ్ళ పేర్లు నోట్ చేసుకొని తన దగ్గరకు పంపవలసిందిగా మేనేజరు ప్రవేశ ద్వారం దగ్గరగదిలో కూర్చునే టెలిఫోన్ బాయ్‌కు ఆదేశించాడు. ఆ లిస్టులో పట్టం కామేశ్వరరావుగారికిష్టం లేదు.)

బస్‌స్టాప్‌లో బస్ ఆగీ ఆగటంతోటే కామేశ్వరరావు ఫర్లాంగు దూరంలో ఉన్న ఆఫీసుకు వురుకు లంకించుకుంటాడు. ఏదో కొంపలంటుకపోతున్నట్లు! లేకపోతే ఏమిటి? అందరికంటె ముందుగా ఆఫీసులో అడుగు బెడితే ఏదో తనకు ఒనగూతుందని ఆయన ఉద్దేశ్యం!

గేటుదగ్గర టెలిఫోన్‌బాయ్ 'గుడ్‌మార్నింగ్ సార్!' అంటాడు. అతను అనటానికి ఈ మాటలే అంటాడుగాని-కాని ఆ మాటలకు అసలు అర్థమేమిటంటే 'మీరు రైట్‌టైంకే వచ్చారు సార్!' అని! ఈ మాట అతను ప్రతిరోజూ అంటాడు,

ఆలస్యంగావస్తే గుడ్‌మార్నింగూ లేదు, గిడ్‌మార్నింగ్ లేదు. అప్పుడప్పుడు 'గుడ్‌మార్నింగ్‌సార్.' అనటానికి బదులు

'బావున్నారా?' అంటాడు, కిటికీలోగుండా బయటికి చూస్తూ అతను ఆ చివర మింగేస్తాడు. ఎందుకంటే - కుశలక్షేమం అడిగింది కామేశ్వరరావుగారినికాదు - బజారున స్టుడియోవేపుకు వెళ్లే ఎక్స్ట్రా పిల్లను. ఈ టెలిఫోన్ కుర్రాడు అన్నమాట విని ఆ పిల్ల సన్నగా నవ్వుతుంది. వయ్యారంగా నడుస్తుంది. ఆడపిల్లలు నవ్వితే టెలిఫోన్ కుర్రాడికి మహదానందం!... టెలిఫోన్‌లో ఆడపిల్లలు మాట్లాడినాకూడా అంతే. టెలిఫోన్ కుర్రాడు 'బావున్నారా?' అని అడిగినందుకు కామేశ్వరరావుగారు బ్రహ్మానందపడి... 'ఆఁ ఫరవాలేదు. శ్రీనివాసన్. బండి నడుస్తోంది!' అని అంటూ లోనికి నడుస్తాడు. అయినా ఆ శ్రీనివాసన్‌కు ఈయన బండి ఎట్లానడిస్తే ఏం? ఆ ఎక్స్ట్రా పిల్ల నడకలోని అందం అవయవాల సోయగం అతనిక్కావాలి. రోజుకు పది పదిహేనుమంది చిరునవ్వుల్ని స్వీకరించి, వాళ్ళ అందాన్ని వీక్షించి, అవయవాల సోయగాన్ని పరికించి తన్మయత్వం చెందుతుంటాడు ఈ టెలిఫోన్ కుర్రాడయిన శ్రీనివాసన్.

కామేశ్వరరావు ఆఫీసులో ప్రవేశించి అందరికి వరసగా నమస్కారాలు పెడతారు! తర. తమ భేదం ఆయనకు లేదు. ఆఫీస్‌బాయ్‌ను అంతా 'నువ్వు' అని సంబోధిస్తే ఈయన మాత్రం 'మీరు' అంటాడు. ఈయన వెళ్ళిన సమయానికి పంఖా వేసివుంటే సరేసరి - లేకపోతే బోయ్‌ను పిలచి కాస్త పంఖా వేస్తారా? అని అడగరు. తనే ఆమూలదాకా నడిచి వెళ్ళి స్విచ్ ఆన్‌చేసి వస్తారు? పది నిమిషాలు సీట్లోకూర్చుని - డ్రాయర్ లోనుంచి కాగితాలు, ఫైళ్లూతీసి బల్లమీద ఉంచు

తాను ! ఆ తరువాత ... మేనేజరుగదికి ప్రయాణం ! — "నమస్కారం !" ... "నిన్న మీకు కొంచెం జలుబు చేసిందన్నారు ! ఎలా ఉందండీ ? ... నేను చెప్పిన వైద్యం చేయించారా ?" ... (ఈయనకు చాలా బైరాగి చిట్కాలుకూడా తెలుసు !) "... మొన్న ... ఆ కంపెనీ విషయం చెప్పారే... కనుక్కున్నానండీ ... అవునండీ విన్నాను. వాడు వట్టి వెధవండీ! లేకపోతే అలా అంటాడా మిమ్మల్ని ? ... అవునండీ మీకు తెలుసునుగా నేనెలాంటివాణ్ణో ! ... నా విముఖతను వెల్లడి చేశానండి ... అవునండి అలాగే అనుకుంటుంటే విన్నాను... మా ఆఫీస్‌బాయ్‌గాడా అండీ ... నిజమండీ మహా సోమరి. మూలన కూర్చొని నిద్రపోతుంటాడు ... మక్కెలు విరగ తన్నాలి ! వాళ్ళే అలుసిచ్చారండీ ! పెంకె వెధవండి ... జీతం తక్కువటండీ ? ..."

ఆ తరువాత కామేశ్వరరావుగారు బయటికొచ్చి కన్పించిన వాళ్ళకు నమస్కరించి ... కళ్ళజోడు తుడుచుకుంటూ తన ఆఫీసు గదికొస్తారు. రాబోయేముందు అట్లా పక్క గదిలో కెళ్లి ... రెండంటే రెండే నిమిషాలు నిల్చుంటారు ! ఆ నిల్చున్నంతసేపులో అక్కడ వాళ్లకు — రెండంటే రెండే మాటలు చెబుతారు. ఒకటి : 'ఇవ్వాళ నా టిఫెన్ ఊతపం !' రెండు : 'నిన్నకూడా మా ఎదురింటి రాజేశ్వరి మొగుడు తాగొచ్చి మళ్లీ పెళ్లాన్ని కొట్టాడు. వట్టి లుచ్చా వెధవ !'

ఆతరువాత తన సీట్లో కూర్చోబోయేముందు ఆ డిపార్టుమెంట్‌లోవున్న ముగ్గురు వ్యక్తుల దగ్గరకు వెళ్ళి పరామర్శించి వస్తారు. 'నిన్న మీరు మౌంట్‌రోడ్ వెళ్ళేటప్పటికి ఇండియా

బుక్ హౌస్ మూసేయలేదుగదా? అని ఒకర్నీ – 'ఏమండీ! మీ అమ్మాయిగారి వీణ తీగెకొంటానికి టి.నగర్ వెళ్ళారుగా– దొరికిందా?' అని మరొకర్నీ ... 'అవునుగాని శ్రీహరిగారూ– రేడియోలో మీ నాటకం ఎప్పుడన్నారు? వచ్చే ఆదివారం నాడుకదూ? వింటానులెండి – మా ఎదురింటి – రాజీ– కాదు ... కార్పొరేషన్‌లో పనిచేసే ఆయనొకడున్నాడులే – వాళ్ళింట్లో రేడియోవుంది! ఆయన చాలా మంచివాడు ... ఎప్పుడైనా వెళ్తే రేడియో ఆన్ చేస్తాడు!...'

కొంచెంసేపు టైపుపని ... మరికొంచెంసేపు ప్రూఫులు దిద్దటం – మరికొంతసేపు సర్క్యులేషను ఫిగర్సుతో పోటీ, ఆ పోటీముగిశాక ... వరల్డ్ జాగ్రఫీ! ఆ బొండ్లు ఎప్పటికి తరిగేను? ఆ చింత ఆయనకులేదు! తన కప్పగించినపని పూర్తి చేయటమే తన విధి! దానికి సంబంధించిన ఇతర వివరాలను గురించి ఆలోచించే అధికారం ఆయన కెక్కడిది?

సరీగ్గా రెండుగంటలకు పక్కగదిలోకి ప్రయాణం! తెచ్చుకున్న టిఫిన్ ఎక్స్ఛేంజి చేసుకోవటం — ఆ పైని 'ఏమాకథ?' అని వాళ్ళడగ్గా ... కథాసారం బెట్టిదని' అని ఆరంభించి రెండున్నరదాకా రాజేశ్వరి ఎట్లా వుంటుందో ఆవిడ భర్త ఎలాంటివాడో – ఎన్ని రోజులకొకసారి బడితపూజ చేస్తాడో ఏమిటో వివరించి చెబుతారు కామేశ్వర్రావుగారు! అది విని వాళ్ళు పకాపకా నవ్వుతారు! కామేశ్వర్రావుకూడా హి హీ హీ అంటారు!

కామేశ్వర్రావుగారికి తర తమ, భేదాలు లేవని చెప్పానుగా! ... అందరితోనూ నవ్వుతూ మాట్లాడతారు ...

యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. బైరాగి చిట్కాలు చెబుతారు !

శ్రమపడి పనిచేస్తారు ! ఎవరితోనూ కోపంగా మాట్లాడరు ! 'ఈ కాగితం కాస్త టైప్ చేస్తారా' అని అడగటం ఆలస్యం 'టపటప' బాదేస్తారు. 'ప్రూఫులొచ్చాయండోయ్!' అంటే చాలు ... గోచి బిగించుకుంటూవచ్చి ఆపనిలో సహాయపడతారు ! ఇతర పనులేమీ లేకపోతే వరల్డు జాగ్రఫీ ఉండనే వుంది.

నియమంగా పదిన్నరలోపు ఆఫీసుకొస్తారు ... పని పూర్తిచేసుకొని ఐదున్నరకు ఆఫీసునుంచి బయలుదేర్తారు ! ఒంటరిగా ఎప్పుడూ ఆయన బయటికి కాలుబెట్టరు ! ఎవరు బయలుదేరుతున్నారా అని చూస్తారు. చూసి వాళ్ళవెంట తనూ తయారు !

రోజూ సాయంత్రంపూట ఇంటికెళ్ళేటప్పుడు ఒక అణా పూలు తీసుకెళ్తారు ... బస్‌స్టాప్‌దగ్గరే ఒక బేడ కూరగాయలు కొంటారు ! (కూరగాయలంటే ఆకుకూర ! ఆకుకూరల్లో అన్నీ విటమిన్లు ఉన్నాయని ఆయన వాదం !) బస్సుల్లోనూ ఎలక్ట్రిక్ ట్రయిన్స్‌లోను ప్రయాణంచేసి ఎట్లాగయితేనేం ..... ఆరున్నరకు ఇంటికి చేర్తారు. చేరటంతోటే స్నానంచేసి బట్టలు మార్చుకుంటారు ! మార్చుకొని చుట్టుపక్కల ఇళ్ళల్లో ఉండే చిన్నపిల్లల్ని ఏకంచేసి ఎదురింటి రాజేశ్వరిగారి వీధి అరుగుమీద కథ పారాయణం చేస్తారు. అంటే చిన్న చిన్న కథలు చెబుతారు ! ఈయనకు తెలియకుండా వచ్చి రాజేశ్వరి వెనుకపక్క కిటికీ దగ్గరగా నిల్చొంటుంది, కథలు వింటుంది. కథల్లో రాకుమా

రుడు ధైర్యం చూయించి రాకుమార్తెను పెళ్ళి చేసుకోవటం వింటుంది. ఇంతలోనే తులశమ్మగారు వాకిట్లో నిల్చుని పిలుస్తుంది. – 'ఇక వేంచేయవచ్చు! అని! కామేశ్వరరావుగారు పిల్లల్ని పంపించివేసి ఇంట్లోకి వేంచేస్తారు. వేంచేసి భోంచేస్తారు. భోంచేసి పడక కుర్చీలో కూర్చుంటారు! ఆ తరువాత లేచి ధోవతి పైకి బిగించి ... బిందెలూ, కడవలూ పుచ్చుకొని బజార్లో ఉన్న కుళాయిని సమీపిస్తారు! వరుసగా నీళ్లు నింపి లోనికి తెస్తారు! ఈయనగారు నీళ్ళపని పూర్తిచేయటం, తులశమ్మగారు వంటింటిపని పూర్తిచేయటం — రెండూ ఒకేసారి పూర్తవుతాయి! 'శ్రీకృష్ణ పరమాత్మా!' అని ఆవిడ చాపమీద మేను వాలుస్తుంది. 'రామచంద్రప్రభో, ఎక్కడున్నావురా?' అంటూ కామేశ్వర్రావు మంచంమీద పడుకుంటాడు! పడుకున్నవాడు పడుకోలేక ... 'ఏమేవ్!' అంటాడు! ఆమె పలకదు! మళ్ళీ అంటాడు 'ఏమేవ్!' అని. 'ఏమిటి?' అంటుంది ఆవిడ! 'ఏమీలేదు!... అబ్బ నువ్వంటే నాకు చాలాప్రేమే!' అంటాడు! అలా అని కళ్ళు మూసుకుంటాడు.

రోజూ తెల్లవారుతుంది, పొద్దుకూకుతుంది. ఋతువులు మార్తాయి. కాలచక్రం దొర్లిపోతుంది. కాని ... కామేశ్వర్రావుగారి నిత్యకార్యక్రమంలో మాత్రం ఎలాంటి మార్పూ రాలేదు.

యథాప్రకారంగానే ...

పాలవాడి కేక రెండాళాకులు! స్నాన సంధ్యలు ... పడకకుర్చి ... బార్బర్ షాపులో దినపత్రిక ... ట్యూషన్...

భోజనం ... బస్ ... ట్రెయిన్ ... ఆఫీసు ... టెలిఫోన్... బాయ్. గుడ్‌మార్నింగ్‌సర్ ... నమస్కారం ... నమస్కారం ... ప్రూఫులు ... టైప్ మెషిన్ ... టిఫెన్ ... వరల్డు జాగ్రఫీ ... ఎదురింటి రాజేశ్వరి ... పిల్లల కథలు ... భార్య పిలుపు ... పంపునీళ్ళు ... 'నీవంటే నాకు చాలా ప్రేమ ...'

మిసిలినియిస్ నోట్సు :

కామేశ్వరరావుగారు సినిమాలకుకూడా వెళ్తుంటారు. (కాంప్లిమెంటరీలు సంపాయించి) ... సంగీతమంటే చెవిగోసుకుంటారు! షూటింగ్ చూట్టం మహాసరదా! ...

అందరితోనూ ఆత్మీయంగానే ఉంటారు. కాని అధిక ఆత్మీయత ఆయన కిష్టంలేదు. తినగా తినగా తీపి చేదవుతుంది.

ఎవరో ఒకసారి ... మెంబరుగా చేర్తారా? అని అడిగితే– 'అబ్బే అలాంటి గొడవలతో నాకు నిమిత్తం లేదన్నారు! ఆ తరువాత ఒక సందర్భంలో అంతా ఒక మాటమీద నిలబడ్డారు! ఇదేమిటి కామేశ్వరరావుగారూ ?' అని అడిగితే ... 'అబ్బే! ఈ గొడవలతో నాకెలాంటి నిమిత్తం లేదని' ఖచ్చితంగా చెప్పారు!

ప్రతి సంవత్సరం దీపావళికి ఒక నెల బోనసు లభిస్తుంది. ఆ బోనసు లభించిన రోజున ప్రొప్రయిటరు దయార్ద్ర హృదయాన్ని గురించి ... ఒక డజనుమంది దగ్గర ప్రస్తావించందే ఊరుకోరు! ఆ రోజు ఇంటికి కొంచెం తొందరగా వెళ్తారు. ఇంటోకి ప్రవేశించకుండానే బజార్లోనుంచే ఉసేవ్! ఉసేవ్!! అంటారు! అని పూలపొట్లం ఆమె కందిస్తారు. 'ఎందుకిన్ని పూలు' అంటుంది! 'ఎందుకో ఊహించూ! అంటాడు. ఆవిడ

వూహించదు. 'చాల్లెద్దురు సంబడం –' అంటుంది. అప్పుడు లాల్చీ జేబులోనుంచి రూపాయలనోట్లుతీసి చూపించి – "బోనస్సే బోనస్సు – ఏమనుకున్నావు మరి మా ఆఫీసంటే!"

కామేశ్వరరావు గారిది ఆదర్శమైన దాంపత్యం. ఎప్పుడూ ఎలాంటి పొరపులూ రావు వాళ్ళిద్దరిమధ్య ! అయితే ఒక విషయం: ఎదురింటి రాజేశ్వరిగారి అరుగుమీద పిల్లల్ని కూర్చో బెట్టుకొని కథలు చెబుతున్నట్లే చెబుతూ– లోపలికి దూరేరు. కామేశ్వరావుగారి తప్పేమీ లేదు. కిటికీదగ్గర నిల్చొని 'రామయ్యగారూ, కాస్త లోనికొస్తారా ?' అని రాజేశ్వరి ఆహ్వానించింది. రాజేశ్వరి భర్త పెళ్ళాంమీద కోపమొచ్చి వదిలి వెళ్ళిపోయి మరెవరితోనో ఉంటున్నాడుగా ! కామేశ్వర రావుగారు పిల్లలకు కథలూ, గిథలూ చెప్పటం మానేసి చెప్పవలసిన వేవో రాజేశ్వరికి చెబుతున్నాడు. కామేశ్వర రావుగారి భార్య భర్త వైఖరి చూసింది. ఒకరోజు తనకళ్ళారా చూసింది — తనభర్త రాజేశ్వరిగారింట్లో కూర్చోవటం!

'ఏమిటండీ ? అంది ఆమె! 'అబ్బే ఏమీ లేదు, రాజేశ్వరికి హస్తసాముద్రికం చెబుతున్నా' అన్నారాయన ! 'చాల్లే ద్దురూ ఎవరైనాచూస్తే ఏమనుకుంటారు ?' 'అవును!' అనే విషయం ఆయనకు తట్టింది. అంతే ఆ రెండోరోజునుంచి రాజేశ్వరివైపు చూట్టం మానేశాట. ఒకరోజు ఆఫీసునుంచి వస్తూ వస్తూ పొరపాటున అటుతొంగి చూసేటప్పటికి — 'ఏమండీ కామయ్యగారూ ! మాయింటికి రావటమే మానే శారు!' అని అడిగింది రాజేశ్వరి. 'ఎవరైనా చూస్తే ఏమను కుంటారు.' అని కామేశ్వరరావుగారు సమాధానంచెప్పారు

అంతే! తరువాత పదిరోజులకు రాజేశ్వరిగారియింటికి వీధిమలుపు మీాది డాక్టర్ నిత్యం వచ్చివెళ్ళటం, కార్లో కూర్చోబెట్టుకుని బయటికి తీసుకువెళ్ళటం కామేశ్వరావుగారు చూశారు! . .. 'ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?' అని అనుకున్నారు మనస్సులో !

ఈయన – కామేశ్వర్రావుగా రంటే! ఈయనకు అన్న వస్త్రాల లేమి సంభవించలేదు. జీవితంలో ఏలోటు ఉన్నట్టు ఆయనకు స్ఫురించదు. పిల్లలకు ఎలాంటి దుర్వ్యసనాలు లేవు. అనుకూల దాంపత్యం. ఒకరికి అప్పుయివ్వడంగాని ఆయన కిష్టముండదు. చాల శాంతస్వభావం. అనవసరపు "గొడవల్లోవ" తలదూర్చరు!

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచి పోతున్నాయి. దేశం రకరకాలైన మార్పు లొస్తున్నాయి. కాని, కామేశ్వర్రావుగారిలో మాత్రం రవ్వంత మార్పుకూడా రాలేదు. ఇక రాదుకూడాను. చవిటినేలను ఎంతచదును చేసి మాత్రం లాభమేముంది?